క్లుప్తంగా

హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకుడు మాడ సాదవరెడ్డి అన్నారు. మండలంలోని ఎల్బాక గ్రామంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ఏ గల్లీకి వెళ్లిన సీసీరోడ్లు, డ్రైయినేజీలు కనిపిస్తున్నాయన్నారు. తెలంగాణలోని అత్యధికంగా గ్రామ పంచాయతీలకు ఉత్తమ జీపీ అవార్డులు వచ్చాయని, సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒక్కటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తరిమికొడతారని అన్నారు. వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మానకొండూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సాయిశ్వేత ప్రజలను కోరారు. మండలంలోని కొండపలకల గ్రామంలో సోమవారం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటిపరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా, జ్వరాలు వస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. అనంతరం రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజు నాయక్, హెల్త్ సూపర్ వైజర్, సరోజ, ఏఎన్ఎంఎస్‌లు సంజీవ, అన్నపూర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు



మాట్లాడుతున్న ముకుందరెడ్డి

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో 19 రోజులుగా జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సోమారం సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలని, కార్మికులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు రాయికంటి శ్రీనివాస్, కార్మికులు అంజయ్య, శ్రీనివాస్, రమేష్, అంజన్‌కుమార్, సంపత్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మికి నివాళి



చిగురుమామిడి: ఇటీవల మృతిచెందిన ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి రాజ్యలక్ష్మికి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకులు నివాళి అర్పించారు. అరకొర వసతులు ఉన్న కాలేజీకి తొమ్మిది సంవత్సరాల పాటు ప్రిన్సిపాల్‌గా పనిచేసి పలువురి మన్ననలు పొందారని ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్‌కుమార్, జనార్దన్, రవి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, కృష్ణమోహన్‌రావ్, శ్రీనివాస్, అనిత, మమత, స్వరూపారాణి, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్రన్, అమరజ్యోతి తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కనుకం కుమార్‌కు గాయాలయ్యాయి. కేశవపట్నంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కుమార్ బస్టాండ్‌లోకి వెళ్తుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్లే బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు.

నడవడానికి నరకయాతన

- అనుబంధ గ్రామాలకు మట్టి రోడ్లే
- వానాకాలంలో తప్పని ఇబ్బందులు
- తారురోడ్లు మంజూరైనట్లు ప్రకటనలకే పరిమితం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గర్రెపల్లి నుంచి సైదాపూర్ రోడ్డు



బేతిగల్‌లో పంట పొలాలకు వెళ్లే దారి



ఆరెపల్లి - జాగీర్‌పల్లి మట్టిరోడ్డు

సైదాపూర్/వీణవంక: మట్టి రోడ్లు మారుత లేవు. రూ.కోట్లలో నిధులు వెచ్చించి తారు రోడ్లు వేయిస్తామన్నా ప్రజాప్రతినిధుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. దీంతో జిల్లాలోని కొన్ని గ్రామాలతో పాటు అనుబంధ గ్రామాల మట్టిరోడ్లు తారు రోడ్లకు నోచుకోవడం లేదు. ఆయా గ్రామాల ప్రజలు వానాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ము, ధూళితో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కొన్ని తండాలు పంచాయతీలుగా ఏర్పడిన సంతోషం ప్రజల్లో ఉంది కానీ మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారులు బురదమయమవుతున్నాయి. మోకాలి లోతు గుంతలతో రైతులు, కూలీలు నడవడానికి, సైకిళ్లు, ఎడ్లబండిపై ఎరువులు, మందులు తీసుకెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. రోడ్లపై మట్టి పోయాలని పాలకులు, అధికారులకు పలుమార్లు రైతులు మొరపెట్టుకుంటున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే రైతులు నరకయాతన పడుతున్నారు. వీణవంక మండలంలో 26 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 34 వేల ఎకరాల వ్యవసాయభూమి ఉంది. పంట పొలాలకు వెళ్లే ప్రధాన రహదారులు సుమారు 120 ఉన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా. బేతిగల్ గ్రామంలో ఇటీవల తలో కొంత రైతులు డబ్బులు పోగు చేసుకొని చర్చి కాలనీ నుంచి సబ్‌స్టేషన్ వరకు మట్టి పోయించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

- సైదాపూర్ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 15 అనుబంధ గ్రామాలున్నాయి.
- మండలంలో 16 గ్రామాలకు మట్టి రోడ్లే దిక్కు. ఆరోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- సోమారం పంచాయతీ పరిధిలో గర్రెపల్లి, పసికపల్లి గ్రామాలకు ఎటూ పోవాలన్నా సరైన రోడ్డుమార్గం లేదు. గర్రెపల్లి మండల కేంద్రానికి రెండు, పంచాయతీ కార్యాలయానికి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
- మట్టి రోడ్డుతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని లీడర్లకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.
- రోడ్డ్యాంలు వర్షాకాలంలో తెగిపోతున్నాయని, శాశ్వత పరిష్కారం పాలకులు చూపడంలేదని గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వాలు మారినా రోడ్లకు మోక్షం లభించడం లేదని, విద్యా, వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పల్లెలకు తారురోడ్లు మంజూరయ్యాయంటున్న నాయకుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.
- సోమారం నుంచి గర్రెపల్లి, గర్రెపల్లి నుంచి సైదాపూర్ రోడ్డు రూ. 2.40 కోట్లు, వెన్నంపల్లి రోడ్డు నుంచి ఆరెపల్లి వరకు రూ. 1.20 కోట్లు, ఘనపూర్ రోడ్ నుంచి రాయికల్ తండా వరకు రూ. 2.80 కోట్లు నిధులు మంజూరయ్యాయని అధికార పార్టీ నేతలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ప్రకటించారు.
- పనులకు టెండర్లు పిలవకపోవడంతో, సంబంధిత పనులకు అంచనాలు తయారు చేసి, టెండర్లు పిలవడానికి సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వర్షాకాలం ప్రారంభమైంది, రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఈ ఏడాది కూడా బురదలో నరకం తప్పదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.
- స్థానిక ప్రజాప్రతినిధులు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బంధువులు రావడంలేదు



పండుగలకు, ఇంటికి రమ్మని సుట్టపోల్లను పిలిస్తే.. మీఊరికి రాం కనీసం రోడ్డు లేదు. ఆటో కూడా మీ ఊరికి రాదు. సైదాపూర్‌లో దిగి గర్రెపల్లికి రావాలంటే మూడు కిలోమీటర్లు నడువాలి. వానాకాలంలో నడవడం కూడా ఇబ్బందే బురదలలో నడవాలి అంటుంర్రు. ఎండాకాలం దుమ్ము, వానాకాలం బురదలో ఊరి నుంచి మండలానికి పోవాలి. ఇటీవల తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు అధికారులు పేర్కొన్నారు.

– తిప్పిరిశెట్టి మహేష్, గర్రెపల్లి

ఎవరూ పట్టించుకోవడంలేదు



ఇటీవల కురిసన వర్షాలకు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే దారులు బురదమయంగా మారాయి. అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి. మట్టి పోయించాలని ఏళ్లుగా మొత్తుకుంటున్నాం. ఎవరూ పట్టించుకోవడంలేదు. అన్నిదారులకు కాకుండా ప్రధాన దారులకు మొరం పోసినా మంచిగుండు. రోడ్డుపై కేజీవీల్స్‌తో ఇంకా బురదగా మారుతుంది. ఇప్పటికైన అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేపించాలి.

– దేవేందర్ రెడ్డి, కనపర్తి, వీణవంక మండలం

టెండర్లు పూర్తి కాగానే పనులు



మండలంలోని సోమారం నుంచి గర్రెపల్లి నుంచి సైదాపూర్ రోడ్డు వరకు రూ. 2.40 కోట్లు, వెన్నంపల్లి రోడ్డు నుంచి ఆరెపల్లి వరకు రూ. 1.20 కోట్లు, ఘనపూర్ రోడ్డు నుంచి రాయికల్ తండాకు రూ. 2.80 కోట్లు ఎమ్మెల్యే కృషితో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంబంధిత పనులకు అంచనాలు తయారు చేసి, టెండర్లు పిలవడానికి సిద్ధం చేశాం. టెండర్లు పూర్తి కాగానే పనులు చేపడతాం.

– యాదగిరి, ఏఈ(పీఆర్), సైదాపూర్

నేడు బొమ్మనపల్లిలో వైద్యశిబిరం

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నామని తాపీకార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు మాతంగి బాబు తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. శిబిరంలో కార్మికశాఖ నుంచి కార్డులు పొందిన వారికి మాత్రమే బీపీ, షుగర్, గుండెతో పాటు ఇతర పరీక్షలు చేయనున్నామని చెప్పారు. గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు (కార్డులు పొందినవారు) అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాబు కోరారు.

జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేయాలి

శంకరపట్నం: మండల కేంద్రంలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు టీటీడీపీ శంకరపట్నం మండల అధ్యక్షుడు సయ్యద్‌ఆరీఫ్ ఫిర్యాదు చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, కిడ్నీ, హార్ట్ సమస్యలతో బాధపడుతున్న వారు మందుల కోసం రూ.వేలు ఖర్చు చేస్తున్నారని, జనరిక్ మందుల దుకాణాలు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరామని ఆరీఫ్ తెలిపారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పీఏసీఎస్ పాలకవర్గం

చొప్పదండి: పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థిని పొన్నం ప్రవళికకు చొప్పదండి పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రూ. ఐదు వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, వైస్ చైర్మన్ ముద్దం మహేశ్‌గౌడ్ సంఘ ఆవరణలో మాట్లాడారు. ఏటా సంఘం పరిధిలో 13 మంది నిరుపేద బాలికలకు రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో కళ్యెం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: అన్ని కులమతాలకు సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని రాష్ట్రంలో అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీకాలనీలో సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చి ఆవరణలో రూ.4 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను చర్చి కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, చర్చి పాస్టరేట్ చైర్మన్ రెడ్డిమల్ల ప్రసాద్, సెక్రటరీ పరంజ్యోతి కుమార్, ట్రెజరర్ లాజరస్, స్టీవార్డ్ బెనహర్, కమిటీ మెంబర్లు టి.జ్యోతి, దేవ ఆశీర్వాదం, లిల్లీ ప్రసాద్, నాయకులు రవీందర్, అశోక్‌రెడ్డి, నాయకులు అధికారులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన వేల్పుల నవ్య పైలెట్ శిక్షణ పొందుతోంది. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తనవంతుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన సందర్భంగా విద్యార్థినికి శిక్షణ నిమిత్తం రూ. యాభైవేలు అందించి చేయూతనిచ్చారు. ఎమ్మెల్యే రవిశంకర్‌కు నవ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి రూ. ఐదువేలు అందించారు. రాబోయే రోజుల్లో మరింత సహకారం చేస్తామన్నారు. కార్యక్రమంలో పెరుక శ్రావణ్‌కుమార్, శ్రీపతి చంద్రశేఖర్ శేఖర్, రేండ్ల శ్రీనివాస్, దాసరి ఆంజనేయులు, శ్రీకాంత్, కత్తి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వెనక్కి



కార్యాలయం ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: ఎంపీపీ రాణిపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకుంటూ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు ఆర్డీవో హరిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఎంపీటీసీ సభ్యులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమన్వయంతో గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గిఫ్టుగా ఇవ్వాలని కోరారు. అవిశ్వాస తీర్మానం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారగా కౌశిక్ రెడ్డి పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు గుడిపాటి సరిత జైపాల్ రెడ్డి, పెవైద్యుల శిరీష, అనిత వెంకట్, కాసం రఘుపతి పద్మ, రాధమ్మ, లలితజయరాజ్, నాగరాజు, రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మానకొండూర్‌రూరల్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండలంలోని శ్రీనివాసనగర్‌లో ఈవీఎంల పనితీరును ప్రజలకు వివరించారు. 18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

వీణవంక: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో ఈవీఎంపై ఏఈవో రాకేశ్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఓటు వేసే విధానం, పనితీరు తదితర అంశాలను వివరించారు. వెంట జూనియర్ అసిస్టెంట్ సోమేశ్వర్, పోలీస్‌సిబ్బంది రవీందర్, సర్పంచ్ ఎనగంటి విజయశ్రీనివాస్, వీఆర్ఏ కృష్ణ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ



రామడుగు: ఎస్సై తిరుపతికి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

శంకరపట్నం: కేశవపట్నం ఎస్సైగా లక్ష్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్సై చంద్రశేఖర్ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీకాగా రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి బదిలీపై వచ్చారు. ఇన్‌చార్జి ఎస్సైగా ఉన్న సురేందర్ నుంచి లక్ష్మారెడ్డి బాధ్యతలు స్వీకరించగా పలువురు నాయకులు సన్మానం చేశారు. ఏఎస్సైలు మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ లతీఫ్, సిబ్బంది రాంబాబు, అశోక్, సదానందం, తదితరులు ఉన్నారు.

రామడుగు ఎస్సైగా తోట తిరుపతి...

రామడుగు: రామడుగు ఎస్సైగా తోట తిరుపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైకి పోలీసు సిబ్బంది బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలుంటే నేరుగా సంప్రదించాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

వొడితెల రాజేశ్వర్‌రావు వర్ధంతి



నివాళి అర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు, తదితరులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల అభివృద్ధికి సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు చిత్రపటం అందజేత

జమ్మికుంట: హుజూరాబాద్ పట్టణంలో రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సోమవారం రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరయ్యారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన చిత్రకారుడు అంబాల ప్రభాకర్ తాను గీసిన హరీశ్‌రావు చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎండీ సజ్జు ఆధ్వర్యంలో నాయకులు నియోజకవర్గంలోని సమస్యలపై సోమవారం వినతిపత్రం అందజేశారు.

'ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం'



మాట్లాడుతున్న గూడూరి సురేశ్

గన్నేరువరం: అభివృద్ధిపై ప్రతిపక్షాల వ్యాఖ్యలు అర్థరహితమని బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గూడూరి సురేశ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో మాట్లాడారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్ పూర్తయి అప్రూవల్ కమిటీ చేరుకుందని, తొందరలోనే అగ్రిమెంట్ పూర్తవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నేతృత్వంలో మానకొండూర్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఉనికి కోసం ఆరాటపడుతున్నాయని విమర్శించారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మండల అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారని పార్టీ నాయకులు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే నెలలో గన్నేరువరంలో యువ ధూంధాం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో యువజన నాయకులు టేకు అనిల్, పత్తి అంజి, మెరుగు రాము, మంగారపు సాయి, కాడే వంశీ, కూన రాజు, బత్తిని శేఖర్, ముత్యం, శ్రావణ్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మహేశ్

గన్నేరువరం: యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన గంప మహేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రామర్తి గోపి, జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్, నియోజకవర్గం, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ప్రశాంత్‌భవన్‌లో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట పట్టణం ప్రభుత్వ కళాశాల మైదానంలో విద్యార్థులు కేటీఆర్ అక్షరాల రూపంలో నిల్చొని శుభాకాంక్షలు తెలిపారు. చొప్పదండి పట్టణం అయ్యప్ప ఆలయంలో వేడుకలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ శివారులోని ప్రశాంత్ భవన్‌లో అనాథ పిల్లలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో జన్మదిన వేడుకల కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీరామకృష్ణ హాజరయ్యారు. కేటీఆర్ నాయకత్వంలో ఐటీ పరిశ్రమ బలోపేతమవుతుందన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ క్యాంపు కార్యాలయంలో నాయకులు వేడుకలు నిర్వహించారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలో వీఆర్ఏలు పాలాభిషేకం చేశారు.

హుజూరాబాద్‌లో భారీ వర్షం

- వరంగల్–కరీంనగర్ ప్రధాన రహదారి జలమయం
- అప్రమత్తమైన అధికారులు



జలమయమైన కరీంనగర్–వరంగల్ రహదారి

హుజూరాబాద్: వర్షాకాలం ఆరంభమై రెండు నెలలు గడిచినా వరుణుడు కరుణించకపోవడంతో ఆందోళన చెందిన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముసురు వానతో జనజీవనం అతలాకుతలమవుతోంది. రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సోమవారం సాయంత్రం హుజూరాబాద్‌లో జోరువాన కురిసింది. దీంతో హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారి జలమయమైంది. అంతేకాకుండా కొన్ని వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. ఎడతెరిపి లేని వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరుతుంది. వీధి వ్యాపారులు ఇంటికే పరిమితం అయ్యారు. వర్షాలకు మున్సిపాలిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. మురుగు కాలువలు నిండి రోడ్డుపై నీరు పారకుండా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందిపడ్డారు. ముంపుకాలనీల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.